ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

శుక్రవారం 26 జూలై 2024





ఇందిరానగర్ ఏరియల్ వ్యూ

ఎవ్వరికీ పట్టని గిరిజనం

మంచానికే పరిమితం

ఈ పాప పేరు మేకల రామక్క. వయసు పది సంవత్సరాలు. ఈపాపకు వికలాంగుల పింఛన్ ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ పాప మానసిక వైకల్యంతో బాధపడుతోంది. కాళ్లు, చేతులు పని చేయడం లేదు. తల్లి సంరక్షణలోనే ఉండాల్సిన దుస్థితి. ఈ పాపకు ఇంత వరకు ఆధార్ కార్డుగానీ, రేషన్ కార్డుగానీ లేవు. ఈ పాప సోదరులు ముగ్గురికి కూడా ఆధార్ కార్డులు లేవు.

పాణ్యం, జూలై 25 : **గిరిజనులు కూడా మనుషులే.. మనలాగా అన్ని సౌకర్యాలు వాళ్లకు కల్పించాలి..అభివృద్ధి ఫలాలు సమానంగా పొందడం వాళ్ల హక్కు... ఈ ఆలోచనలు మన ప్రభుత్వాలకు లేవు. నోరులేని ఆదివాసులంటే నిర్లక్ష్యం, చిన్న చూపు. ఎన్నికలు వచ్చినప్పుడు ఏదోలాగా ఓట్లు వేయించుకొని ఆ తర్వాత చెంచు గూడేల వైపు నాయకులు తిరిగి చూడటం లేదు. చెంచుల అభివృద్ధికి రూ. కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడమేగాని చేసిందేమీ లేదని చెప్పడానికి పాణ్యం చెంచు కాలనీలోని జన జీవితమే నిదర్శనం.**

- తలరాతలు మారని చెంచులు
- సంక్షేమ పథకాలకు దూరం
- దివ్యాంగులకు అందని పింఛన్లు
- ఐటీడీఏ నిర్లక్ష్యానికి ఆదివాసులు బలి
- కాలనీ వైపు కన్నెత్తి చూడని అధికారులు

పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ నడిబొడ్డున చెంచుల కాలనీ ఇందిరానగర్‌లో 300 చెంచు కుటుంబాలు నివసిస్తున్నాయి. దాదాపు 45 ఏళ్లుగా ఈ కాలనీ ఉన్నా అభివృద్ధి అంతంత మాత్రమే. చెంచుల అభివృద్ధికి యేటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా వీరి జీవన ప్రమాణాలు కనీసంగా మెరుగు కావడం లేదు. వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడనడానికి ఈ కాలనీలోని దాదాపు 30 మందికి ఇంత వరకు పింఛన్‌లు అందకపోవడమే నిదర్శనం. ఐటీడీఏ అధికారులు తమను మనుషులుగా గుర్తించడం లేదని చెంచులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసినా చెంచు గూడెంలో వికలాంగులను గుర్తించడంలో విఫలమయ్యారనడానికి ఈ సంఘటనే సాక్షం. ఇటీవల టీడీపీ, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక సర్వేలో మానసిక వైకల్యం, చెవుడు, మూగ సమస్యలు ఉన్న 30 మంది చెంచులను గుర్తించారు. వీరిలో కొందరికి ఆధార్ కార్డులు లేవు. మరి కొందరికి ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు. ఎక్కడికి వెళ్లి నమోదు చేసుకోవాలో తెలియని దుస్థితిలో వీరు ఉన్నారు. కాలనీలో మూడుసార్లు ఆధార్ నమోదు, పింఛన్ నమోదు క్యాంపెయిన్ నిర్వహించామంటున్న అధికారులు మాత్రం వీరిని గుర్తించకపోవడం విడ్డూరం. వీరికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో ఐటీడీఏ అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. ఈ వికలాంగులు పాఠశాలల్లో చేరినట్లు దాఖలాలు లేవు. కనీసం మానసిక వికలాంగుల (విభిన్న ప్రతిభావంతులు) కోసం ఏర్పాటు చేసిన భవిత పాఠశాలలోనూ ఈ పిల్లలను చేర్పలేదు. నలుగురు చెంచు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలోనూ ఇద్దరికి పింఛన్ అందడం లేదు. ప్రభుత్వ పథకాలకు చెంచులు అనర్హులా? అని చెంచులు ప్రశ్నిస్తున్నారు.

పుట్టు మూగ, చెవుడు



ఈయన పేరు తోట రాజన్న. వయసు 60 యేళ్లు. ఇతనికి ఆధార్, రేషన్, ఓటరు కార్డులు లేవు. వీరిని ఐటీడీఏ, వీటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించలేదు. మామిడి తోటలకు కావలి ఉంటూ ఇతను జీవిస్తున్నాడు. ఇతనిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఐటీడీఏ అధికారులు గుర్తించలేదు



ఈ బాలుడి పేరు బాపట్ల కోటయ్య. చిన్నప్పుడే చూపు కోల్పోయాడు. తల్లిదండ్రులే ఈ అబ్బాయికి దిక్కు. ఇంత వరకు పింఛన్‌కు నోచుకోలేదు. ఐటీడీఏ అధికారులకు ఈ అబ్బాయి కనిపించలేదు.

వికలాంగుల సర్టిఫికెట్ ఇవ్వలేదు



ఈ పాప పేరు దాసరి నాగమణి, వయస్సు 7 సంవత్సరాలు. పుట్టు మూగ, చెవుడు. అవిటితనంతో తల్లిని వదలలేని పరిస్థితి. ఈ పాపకు ఆధార్ ఉన్నా వికలాంగుల సర్టిఫికెట్ ఇవ్వలేదు. దీంతో పింఛన్ అందడం లేదని తల్లి దేవి తెలిపారు. వికలాంగుల సర్టిఫికెట్ ఎలా తెచ్చుకోవాలో తెలియదని చెబుతోంది.

అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు

ఈమె పేరు పొట్లూరు పిచ్చమ్మ. వయస్సు 47 సంవత్సరాలు, వితంతు పింఛన్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. పలుమార్లు పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు.



వలంటీర్ పట్టించుకోలేదు



ఈ యువకుని పేరు దాసరి మల్లికార్జున. వయస్సు 24. పుట్టు మూగ, చెవుడు. ఇంత వరకు పింఛన్‌కు నోచుకోలేదు. ఇతని వృత్తి అడవికి వెళ్లి తేనె సేకరించడం. ఇతను కాలనీలో నివాసం ఉంటున్నా వలంటీర్ గానీ, గ్రామ సచివాలయ సిబ్బంది కానీ పట్టించుకోలేదు. దీంతో ఇతనికి సంక్షేమ పథకాలు అందడం లేదు.

ఉమ్మడి జిల్లాలోని చెరువులను నింపాలి

- పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేయాలి
- రాయలసీమ సాగు నీటి సాధన సమితి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, జూలై 25: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఉమ్మడి జిల్లాలోని చెరువులకు నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో రిజర్వాయర్ నీటి మట్టం 854 అడుగులు చేరుతోందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి రాయలసీమలోని రిజర్వాయర్లకు నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప జిల్లాలకు సంబంధించిన కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీ-నీవా ప్రాజెక్టుల సాగునీటి విడుదలపై సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని బొజ్జా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాగునీటి రంగ హక్కులను హరించే కేంద్ర గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును అమరావతిలో కలిసి కోరినట్లు తెలిపారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిశామన్నారు. సాగునీటి హక్కులకు విఘాతం కలిగించే విధంగా కేంద్ర తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ఎస్‌వో-4375(ఈ) తేదీ 6.10.2023 రద్దుకు కృషి చేయాలని జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. సాగునీటి సమస్యలపై జలవనరుల శాఖ మంత్రి సమగ్రంగా చర్చించడానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, ఏర్వా రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాసంతి కుటుంబానికి అండ

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్



ముచ్చుమర్రిలో బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కమిషన్ సభ్యులు

పగిడ్యాల, జూలై 25: అత్యాచారం, హత్యకు గురైన బాలిక వాసంతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ముచ్చుమర్రి గ్రామంలో వాసంతి కుంటుబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. వాసంతి హత్యకు గురైన పార్కును పరిశీలించి పోలీసులతో కలిసి కృష్ణానదిలోకి బోట్‌లో వెళ్లి మృతదేహం కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేస్తున్న గాలింపు చర్యలను పరిశీలించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీన బాలిక హత్యకు గురైదన్న విషయాన్ని తెలుసుకొని కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. నిందితులకు చట్టం ప్రకారం శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. ప్రభుత్వం బాలిక తల్లిదండ్రులకు అండగా నిలుస్తుందని అన్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా శిశు సంరక్షణాధికారి శారద, జూబేదా బేగం, సీడీపీవో కోటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి భారీ వరద



శ్రీశైలం జలాశయం

శ్రీశైలం, జూలై 25: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి గురువారం భారీగా వరద ప్రవాహం కొనసాగింది. జూరాల జలాశయం నుంచి 2,52,605 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2,095 క్యూసెక్కులు మొత్తం 2,54,700 వరద నీరు దిగువకు విడుదల చేశారు. గురువారం సాయంత్రం 9 గంటల సమయానికి 1,96,187 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 855.20 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 94.2380 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి విడుదల చేశారు.

సంగమేశ్వర ఆలయ శిఖరాన్ని తాకిన గంగమ్మ



సంగమేశ్వర ఆలయ శిఖరాన్ని తాకిన వరద జలాలు

కొత్తపల్లి, జూలై 25: రాష్ట్రంలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్తపల్లి మండలంలోని శ్రీశైలం జలాశయంలో నిక్షిప్తమైన సప్తనదుల సంగమేశ్వరం ఆలయాన్ని వరద జలాలు ముంచెత్తుతున్నాయి. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి విడుదల చేస్తున్నారు. దీంతో సంగమేశ్వర ఆలయ శిఖరం మాత్రమే భక్తులకు దర్శనం ఇస్తోంది. ఇంకో పది అడుగుల మేర నీరు చేరితే సంగమేశ్వర ఆలయం పూర్తిగా నది గర్భంలో కలిసిపోనుంది. ఇక నుంచి ఎగువ ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో నిత్య పూజలు జరగనున్నాయని పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ తెలిపారు.

ప్రజా క్షేమమే లక్ష్యం

డోన్, జూలై 25: సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రజల క్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకుంటున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలం డ్యాంను ఎమ్మెల్యే కోట్ల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం శుభపరిణామమన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెచ్చేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి బిడ్డకు తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని అన్నారు. డోన్ నియోజకవర్గంలో కరువు పరిస్థితులను రూపుమాపేందుకు రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి, ఎరుకలి చెరువు శివ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం డ్యాంను సందర్శించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

భూ సేకరణ పనులు పూర్తి చేయండి: కలెక్టర్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), జూలై 25: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర భూసేకరణల ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌వో పద్మజ, రెవెన్యూ అధికారులు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీ గోవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లతో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 340 సీ ప్యాకేజీ 4 కింద జూపాడుబంగ్లా పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు మండలాల మీదుగా వెళ్లే రహదారి భూసేకరణకు 75.47 ఎకరాలు పెండింగ్‌లో ఉందని అన్నారు. దీనికి సంబంధించి తహసీల్దార్ల నుంచి క్లెయిమ్స్ తెప్పించుకుని నిశితంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే 167కే 1వ ప్యాకేజీ కింద నంద్యాల నుంచి జమ్ములమడుగు వరకు వెళ్లే రహదారికి సంబంధించి నంద్యాల గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లో పెండింగ్‌లో ఉన్న అవార్డులను త్వరితగతిన పాస్ చేయాల్సిందిగా నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష ఆ సమావేశంలో ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, దాసు, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు కేజీబీవీలో విచారణ

- విద్యార్థినులకు నాసిరకం భోజనం
- అధికారుల్లో సమన్వయ లోపం
- విచారణ అధికారుల వెల్లడి



ఎమ్మిగనూరు పట్టణంలోని కస్తుర్బా గాంధీ విద్యాలయంలో వంట మనుషులను విచారిస్తున్న ఏడీ శామ్యుల్ పాల్

ఎమ్మిగనూరు, జూలై 25: ఎమ్మిగనూరు పట్టణంలోని కేజీబీవీ కస్తుర్బా గాంధీ విద్యాలయంలో డీఈఓ కార్యాలయం ఏడీ శామ్యుల్‌పాల్, ఎస్ఎస్ఏ జీసీడీఓ స్నేహలత, డిప్యూటీ డీఈఓ వెంకటరామి రెడ్డి గురువారం విచారణ నిర్వహించారు. కొన్ని రోజులుగా విద్యాలయంలో చదివే విద్యార్థినులకు సరైన సమయానికి భోజనం, టిఫిన్ అందటం లేదని, అది కూడా నాణ్యతగా లేకపోవడంపై ఇటీవలి కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డీఈఓ కార్యాలయం, ఎస్ఎస్ఏ అధికారులు విద్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ముందుగా వంటమనుషులను, సిబ్బందిని విచారించారు. వారిమధ్య సమన్వయం లేదని అధికారులు గుర్తించారు.

● **కన్నీటి పర్యంతమైన విద్యార్థిని :** విచారణకు వచ్చిన అధికారుల ఎదుట ఓ విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. ఆ విద్యార్థినితో పాటు మిగతా విద్యార్థినులు సైతం భోజనం ఏమాత్రం బాగోలేదని, తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థిని భోజనం తింటే ఆయాసం వస్తోందని అధికారులకు తెలిపింది. టిఫిన్ ఉదయం 11 గంటకు పెట్టారని, ఒక రోజు భోజనం రాత్రి పొద్దుపోయిన తరువాత పెట్టగా రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటలకు పెట్టారని చెప్పారు. టిఫిన్, భోజనం ఆలస్యంగా ఇవ్వడం వల్ల తరగతులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఏడీ శామ్యుల్ పాల్, జీసీడీఓ స్నేహలత మాట్లాడుతూ కేజీబీవీలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, సరిపడా భోజనం కూడా ఇవ్వడం లేదన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. ప్రిన్సిపాల్, వంటమనుషులు, సిబ్బందితో పాటు విద్యార్థినులతో సుదీర్ఘంగా విచారించామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కేజీబీవీలో విచారణకు వచ్చిన అధికారులకు విద్యార్థి సంఘాల నాయకులు విజేంద్ర, రాజేష్, మహేంద్ర బాబు, ఉదయ్ కుమార్, వీరేష్ యాదవ్, అఫ్రిది, శేఖర్, రఘులు విద్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ కవిత పదేళ్లుగా ఇక్కడే ఉంటోందని, దీంతో విద్యార్థినులకు సరైన భోజనం అందడం లేదని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



విద్యార్థినులతో వివరాలను సేకరిస్తున్న విచారణ అధికారులు



ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కిరాణ షాపులో దొంగతనం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 25 : ఎమ్మిగనూరు పట్టణంలోని కమిటీ రోడ్డు సమీపంలో ఉన్న వెంకటేశ్వర ఆయిల్, కిరాణ మర్చంట్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. కంబలదిన్నె గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కమిటీ రోడ్డులో షాపు నిర్వహిస్తున్నాడు. నిన్న రాత్రి యథావిధిగా షాపునకు తాళం వేసి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూసే సరికి షాపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. సీసీ కెమెరాకు ఉన్న కనెక్షన్ వైరులను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. షాపులోని బస్తా కంది పప్పు, రూ.50వేల సిగరెట్ల డబ్బా, ఆయిల్ డబ్బా, రూ. 65 వేల నగదు మొత్తం రూ.1.50 వేల దొంగతనం జరిగింది. షాపు యజమాని బోయ తిమ్మప్ప జరిగిన సంఘటన గురించి పోలీసులకు తెలపగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరి మృతి



వీరన్న (ఫైల్)



హరిక్రిష్ణ (ఫైల్)

నందికొట్కూరు రూరల్ జూలై 25 : బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారి 340 సీ కేజీపై ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్ పరిధిలో కేజీ రహదారిపై కర్నూలు నుంచి వస్తున్న ఏపీ 21టీ జెడ్ 1294 నెంబరు గల ఆటోను నందికొట్కూరు నుంచి కర్నూలు వెళుతున్న నాన్ స్టాఫ్ ఆర్టీసీ ఆల్ట్రా పల్లె వెలుగు బస్సు ఏపీ 21 జెడ్ 0840 నెంబరు గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాతనకోట గ్రామానికి చెందిన టీ వీరన్న (28) హరిక్రిష్ణ (26) అనే మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరన్న ఆటో నడుపుతుండగా అతనితో కలిసి ప్రయాణిస్తున్న హరికృష్ణ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. వీరన్నకు ఏడు నెలల క్రితం ప్రాతకోటకు చెందిన హైమావతితో వివాహం జరిగింది. ఆయన భార్య మూడు నెలల గర్భిణి. ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం హైమావతిని ప్రాతకోట వెళ్లే బస్సు ఎక్కించి పంపించారు. అనంతరం వీరన్న తన పెళ్లి ఫొటో ఆల్బమ్ తీసుకొని మిత్రుడు హరికృష్ణతో కలిసి స్వగ్రామానికి తిరుగు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలానికి ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున చేరుకుని మృతదేహాలను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరన్న తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

31న స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: బి. తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ మైనార్టీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఆటో మొబైల్, మెకానికల్, ఇంజనీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈ నెల 31న ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి ఫీజు రూ.5,800 చెల్లించాలన్నారు. వివరాలకు 8919638961, 8897544821 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్‌బీపీఆర్ కళాశాలలో...

ఎస్‌బీపీఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో బయో మెడికల్ ఇంజనీరింగ్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో భర్తీ కానీ సీట్ల కోసం ఈ నెల 31న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాలకు పాలిటెక్నిక్ కార్యాలయంలో సంప్రదించి ఈ నెల 29న సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.6వేలు చెల్లించి అడ్మిషన్ పొందాలని వివరించారు. వివరాలకు 99898 99095 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వినియోగదారుల కమిషన్ ద్వారా ఇద్దరికి న్యాయం

కర్నూలు(లీగల్), జూలై 25: కొనుగోలు చేసిన పరికరాలు సరిగా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన ఇద్దరికి సత్వర న్యాయం అందించినట్లు జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్ తెలిపారు. స్థానిక సోమిశెట్టి నగర్‌కు చెందిన బి. నరేష్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న రూ.36 వేలు చెల్లించి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో హెయిర్ కంపెనీకి చెందిన ఒక వాషింగ్ మిషన్‌ను కొనుగోలు చేశాడు. అయితే కొన్ని వారాలకే అది సరిగ్గా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఫిర్యాదికి కొత్త వాషింగ్ మిషన్ ఇచ్చేందుకు హెయిర్ కంపెనీ అంగీకరించింది. మరొక కేసులో స్థానిక నంద్యాల చెక్‌పోస్టుకు చెందిన మాజీ ఎయిర్‌ఫోర్స్ అధికారి వెంకటయ్య గత మార్చి నెలలో ఎల్‌జీ కంపెనీకి చెందిన వాటర్ ఫిల్టర్‌ను కొనుగోలు చేశారు. అది సరిగ్గా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ నుంచి నోటీసు అందుకున్న ఎల్‌జీ కంపెనీ సిబ్బంది పని చేయని పరికరాన్ని మార్చేందుకు అంగీకరించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా నకిలీ విలేకరుల ముఠా

ఆదోని, జూలై 25: ఫుడ్‌సేఫ్టీ అధికారులమంటూ నలుగురు నకిలీ విలేఖర్లు హోటల్ వ్యాపారుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేశారు. రెండు రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై ఆదోని మార్కెట్ యార్డ్‌లోని ఉన్న రెడ్డి హోటల్‌కు వెళ్లారు. తాము ఫుడ్‌సేఫ్టీ అధికారులమని హోటల్ యజమానిని పరిచయం చేసుకున్నారు. హోటల్‌ను తనిఖీ చేయాలని కిచెన్‌లోకి వెళ్లారు. అంతా పరిశీలించాక ఈగలు అధికంగా ఉన్నాయని, ఇలా ఉంటే రోగాలు వస్తాయని, ఇలా ఉంటే హోటల్‌ను మూసేస్తామని హెచ్చరించారు. అందులో ఉన్న మరో వ్యక్తి లంచానికి బేరం పెట్టాడు. యజమాని వీరారెడ్డి వెంటనే రూ.వెయ్యి ఇస్తానని అన్నాడు. దానికి వారు రూ.30వేలు ఇవ్వాని అన్నారు. చివరికి రూ.2వేలు తీసుకొని చిత్తగించారు. వాళ్లు వెళ్లిపోయాక హోటల్ యజమాని విచారిస్తే వాళ్లు సోషల్ మీడియాలో పనిచేస్తున్న నకిలీ విలేఖరులని తేలింది. వీరు పట్టణంలో చాలా హోటల్లోనూ, బార్ అండ్ రెస్టారెంట్లలోనూ ఇదే విధంగా బ్లాక్‌మెయిల్ చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. బైపాస్ రోడ్డులో ఇటీవల లారీలను నిలిపి పోలీసులమంటూ లారీలోని రికార్డులను తనిఖీ చేసి రూ.40వేలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక చోట కొంత మంది నకిలీ విలేకరులు అధికారుల పేర్లు చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఒలింపిక్స్‌లో దేశానికి వన్నె తేవాలి

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 25: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటి భారతావనికి వన్నె తేవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. భారత క్రీడాకారులకు మద్దతుగా గురువారం ఉదయం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో టీజీ వెంకటేశ్‌తో పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ, రెండో ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ టీజీ వెంకేటశ్ మాట్లాడుతూ దేశ క్రీడారంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. డా.శంకర్‌శర్మ మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారులు పతకాలతో సత్తా చాటాలన్నారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్‌బీఐ సర్కిల్, చిన్న పార్కు, కోట్ల సర్కిల్, కోల్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగింది. ఈ ర్యాలీలో క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, నాగరత్నమయ్య, వంశీ, నవీన్, గుడిపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజు దగ్గర ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ టీజీ, డా.శంకర్‌శర్మ, క్రీడా సంఘాల ప్రతినిధులు

పెద్దాసుపత్రి అభివృద్ధికి సహకరిస్తాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: రాయలసీమ జిల్లాల ఆరోగ్య సంజీవిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. గురువారం ఆయన సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డిని కలిసి ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించి చర్చించారు. స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన వైద్య పరికరాల గురించి ముఖ్యమంత్రి, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో చర్చిస్తామని తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ జిల్లా రివ్యూ మీటింగ్ ఉంటుందని, అందులో జిల్లాకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రులు, ఆదోని, కర్నూలు మెడికల్ కాలేజీల అభివృద్ధి గురించి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి ముఖ్యమంత్రి, మంత్రులు నారా లోకేశ్, సత్య కుమార్‌తో కలిసి చర్చిస్తామన్నారు. క్యాన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన నిధుల గురించి, ఆదోని మెడికల్ కాలేజీ, కర్నూలు జీజీహెచ్‌లో జరుగుతున్న పనుల పురోగతి గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డిని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, టీడీపీ స్టేట్ సెక్రటరీ నాగేంద్ర, హెచ్‌డీఎస్ మాజీ సభ్యులు పోతురాజు రవికుమార్, రవి పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

వృద్ధురాలి ఆత్మహత్య

బేతంచెర్ల, జూలై 25: పట్టణంలోని బోయపేటలో నివసిస్తున్న బోయ హుశేన్ భార్య నాగలక్ష్మమ్మ (60) అనారోగ్యంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఇంటి నుంచి వెళ్లి బనగానపల్లె రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జటాధర శివాలయం పక్కన ఉన్న బావిలో దూకి నాగలక్ష్మమ్మ ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వజ్రాల వేటకు వచ్చి మృత్యువాత

పాముకాటుకు గురైన అనంతపురం మహిళ

మహానంది, జూలై 25: వజ్రాల వేటకు పుల్లా లక్ష్మీదేవి(58) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మహానంది మండలం ఆంజనేయపురంలో జరిగింది. పది రోజుల క్రితం మండలంలోని సర్వనరసింహ స్వామి ఆలయం సమీపంలో ప్రవహించే వాగులో వజ్రల వేటకై అనంతపురానికి చెందిన పుల్లా లక్ష్మీదేవితోపాటు మరి కొందరు వచ్చారు. బుధవారం ఆంజనేయపురంలో విడిది చేసే ప్రాంతానికి లక్ష్మీదేవి చేరుకుంది. తన వెంట తెచ్చుకున్న బ్యాగులో నుంచి బట్టలు తీసుకునేందుకు తెరిచే సరికి అప్పటికే బ్యాగులో ఉన్న పాము కాటు వేసింది. మిగతా వాళ్లు ఆమెను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక ఆమె మృతి చెందింది. గురువారం మృతురాలి కుమారుడు ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు, జూలై 25: ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్లకు ఆటో టాప్ నెంబర్ల ఐడీ కార్డులను అందజేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఆటోలు బళ్లారి చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, నగరంలోని పాఠశాలలు వంటి ముఖ్యమైన కూడళ్లలో ఇతర వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఆటోలు నడపవద్దని సూచించారు. అలాగే క్రమశిక్షణతో వ్యవహరించాలని అన్నారు. రికార్డులు లేని, ర్యాష్ డ్రైవింగ్ చేసే ఆటోల వివరాలను తెలిపి పోలీసులకు సహకరించాలని కోరారు.



ఆటో టాప్ నెంబర్ల కార్డులు అందజేస్తున్న ఎస్పీ

గర్భిణికి చుక్కలు చూపిన వైద్యులు

- ఓపీ చింపి బయటకు పంపారంటున్న బంధువులు
- కలెక్టర్ జోక్యంతో అడ్మిషన్
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వైనం



బాలింతను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: నిండు గర్భిణికి కర్నూలు జీజీహెచ్ గైనిక్ వైద్యులు చుక్కలు చూపించారు. నందవరం మండలం గురజాలకు చెందిన శశికళకు పురిటి నొప్పులు రావడంతో బుధవారం ఎమ్మిగనూరు నుంచి అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఉదయం 11 గంటలకు కాన్పు కోసం ఓపీ తీసుకొని రాగా అక్కడి వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉన్నా అడ్మిట్ చేసుకోలేదు. గైనిక్ వార్డులోని వైద్యులు గర్భిణి ఓపీని చింపి బయటకు పంపారు. దీనిపై బంధువులు ప్రశ్నించగా.. ఎవరికైనా చెప్పుకోండి, కలెక్టర్‌కైనా, పెద్ద డాక్టర్‌కైనా.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గర్భిణి బంధువులు, భర్త సాయంత్రం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సిఫారసుతో సాయంత్రం 5.30 గంటలకు కాన్పుల వార్డులో వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఈ విషయాన్ని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. గురువారం అడ్మిషన్ అయిన శశికళ సాయంత్రం మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం బాలింతను రాత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ పరామర్శించారు.

తల్లీ బిడ్డ క్షేమం - డా.సి. ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో గురజాల గ్రామానికి చెందిన శశికళ మొదటి కాన్పుకు బుధవారం వచ్చింది. గర్భిణికి ఉమ్మ నీరు తక్కువగా ఉండటం వల్ల గురువారం సాయంత్రం సిజేరియన్ చేశారు. మగబిడ్డ పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

డీజీపీని కలిసి ఎమ్మెల్యేలు



డీజీపీకి పూ లమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కల్లూరు, జూలై 25: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గురువారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకుడు యశ్వంత్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈమేరకు పాణ్యం, నందికొట్కూరు, నియోజకవర్గాలతో పాటు నంద్యాల జిల్లా పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించిన పలు అంశాలను డీజీపీ దృష్టికి వారు తీసుకెళ్లారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సూచించారు. గురువారం దేవనగర్‌లోని గుడ్‌షెపర్డ్ పాఠశాలలో కర్నూలు డివిజన్ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని యజమాన్య పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హైస్కూల్‌లో 5 ప్రాజెక్టులను, ప్రాథమికోన్నత పాఠశాలలో 3 ప్రాజెక్టులలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార దిశగా ప్రాజెక్టు నమూనాలు ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి అత్యధిక నామినేషన్లు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.మిన్నెల్ల, జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ, రిసోర్స్‌పర్సన్లు దాసు, ఉస్మాన్, కోఆర్డినేటర్స్ రాజశేఖర్, మరియానందం, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్ మోసం..

కువైట్‌లో కర్నూలు వాసి ఆవేదన

కర్నూలు, జూలై 25: నకిలీ ఏజెంట్ ద్వారా కువైట్‌కు వెళ్లి మోసపోయిన ఓ కర్నూలు వాసి తిరిగి భారతదేశానికి రావడానికి ఇబ్బందులు పడటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు చెందిన అల్తాఫ్ అనే వ్యక్తి ఈ ఘటనలో బాధితుడు. అల్తాఫ్ కూలి పని కోసం కువైట్ వెళ్లేందుకు ఈ ఏడాది జనవరి 10వ తేదీన కర్నూలు చెందిన లాల్‌బాషా, మహబూబ్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను ఆశ్రయించాడు. సుమారు వారికి రూ.60వేలకు పైగా ఫీజు చెల్లించి, వారి ద్వారా కువైట్ వెళ్లాడు. అయితే అక్కడ పని నచ్చకపోవడంతో తిరిగి భారత్‌దేశానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే భారత్ నుంచి పంపిన ఏజెంట్లే తిరిగి రప్పించాలి. అయితే కువైట్ ఎంబసీలో లాల్‌బాషా, మహబూబ్‌బాషాలతో రిజిస్ట్రేషన్ అయిన ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో బాధితుడు తిరిగి కర్నూలు రావడానికి ఇబ్బంది పడ్డాడు. ఆ ఇద్దరూ నకిలీ ఏజెంట్లు అని కువైట్ అధికారులు తెలిపారు. బాధితుడు కొందరి సాయంతో ఇండియన్ ఎంబసీ అధికారులను సంప్రదించి రూ.35వేలు చెల్లించి ఎలాగో కర్నూలు చేరుకున్నాడు. తాను మోస పోయానని గుర్తించి లాల్‌బాషా, మహబూబ్‌బాషాలపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 25: నగర పాలక సంస్థ స్థాయి సంఘం కమిటీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. గురువారం అడిషనల్ కమిషనర్ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేసిన కార్పొరేటర్ల సమక్షంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు పరిశీలన చేపట్టారు. నామినేషన్ పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జునైద్, ఉద్యోగులు జీఎం.శ్రీకాంత్, రామక్రిష్ణ పాల్గొన్నారు. 28న విత్‌డ్రా ఉన్నట్లు మేనేజర్ తెలిపారు.

● **జనసేన వైపు ఇద్దరు కార్పొరేటర్లు:** వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు జనసేన వైపు చూస్తున్నారు. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీలో సభ్యుల కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరిలో ఒక్కరికి వచ్చిన వైసీపీలోని కొనసాగుతామని, లేనిపక్షంలో జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. అంతేకాకుండా నామినేషన్ పత్రాల పరిశీలన సమయంలో కూడా ఆ ఇద్దరు రాలేదు. పరిశీలన పూర్తయిన అనంతరం వచ్చి సంతకాలు చేశారు. అదేవిధంగా కర్నూలు నియోజకవర్గం వైసీపీ నుంచి ఇద్దరు ముస్లిం మైనార్టీలకు ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ



స్టాక్ వివరాలను తెలుసుకుంటున్న వ్యవసాయాధికారులు

నంద్యాల టౌన్, జూలై 25: నంద్యాల పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీలు చేశారు. పట్టణంలోని శివ సంతోష్‌రెడ్డి ఏజెన్సీస్ ఎరువులు, పురుగు మందుల స్టాక్ నిలువలు, స్టాక్ బుక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఇతర ధృవపత్రాలు తనిఖీ చేసి రిజిస్టర్ నిర్వహణలో పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ ఎరువు దుకాణం యజమానులు ఖరీఫ్ సీజన్‌కి ఎరువుల కొరత లేకుండా ఎరువుల నిల్వ చేసుకోవాలని, హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ డీలర్లు రైతులకు ఎరువుల కొరత రాకుండా సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేట్లు చూసుకోవాలని, స్టాక్ రిజిస్టర్‌లు గోడౌన్ ప్రకారం, గ్రేడ్ ప్రకారం నిర్వహించాలన్నారు. అదే విధంగా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదని, రైతులకు కావాల్సిన ఎరువులు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హోల్‌సేల్, రిటైల్ ఎరువుల, పురుగు మందుల డీలర్లను హెచ్చరించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

● విజేతగా నిలిచిన వెంకటగిరి ఎద్దులు

కొత్తపల్లి, జూలై 25: కొత్తపల్లి మండలం గోకవరం గ్రామంలో హుశేన్ సాబ్ దర్గా ఉరుసు పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఇందులో వెంకటగిరికి చెందిన ఎద్దులు మొదటి బహుమతి కైవసం చేసుకున్నాయి. గురువారం గ్రామ శివారులో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో స్థానిక సర్పంచ్ మారెన్న, నాయకులు పుల్యాల చంద్రశేఖర్ రెడ్డి, చాకలి నాగశేషులు, గ్రామస్థుల సహకారంతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో వెంకటగిరికి చెందిన కృష్ణప్రసాద్ ఎద్దులు 5,073 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.35వేలు కైవసం చేసుకున్నాయి. నారాయణాపురం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఎద్దులు 4,800 అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.25వేలు గెలుచుకున్నాయి. మల్యాల గ్రామానికి చెందిన షేక్ షైమున్నా ఎద్దులు 4,576 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ.15వేలు గెలుపొందాయి. కొత్తకోట గ్రామానికి చెందిన గురునాథ్ ఎద్దులు 4,500 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని రూ.10వేలు నగదు దక్కించుకున్నాయి. అలాగే దర్శి పట్టణానికి చెందిన గరికపాటి వెంకట్ ఎద్దులు 4,341 అడుగులు లాగి 5వ బహుమతి రూ.8వేలు కైవసం చేసుకున్నాయి. అదే విధంగా ఎ.కోడూరు గ్రామానికి చెందిన చాగంటి నాగేశ్వరరెడ్డి ఎద్దులు 4,204 అడుగులు లాగి రూ.5 వేలు బహుమతిని గెలుచుకున్నాయి. కార్యక్రమంలో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

● పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు, జూలై 25: షుగర్ లెవెల్స్ పడిపోయి హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలోని తలముడిపి గ్రామంలో జరిగింది. తలముడిపి గ్రామానికి చెందిన రంగస్వామి(49) ఆళ్లగడ్డ పట్టణ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విధులు నిర్వహించుకుని తన స్వగ్రామం తలముడిపికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత షుగర్ లెవెల్స్ పూర్తిగా పడిపోయి మృతి చెందారు. రంగస్వామి మృతికి తోటి ఉద్యోగులు, అధికారులు సంతాపం తెలిపారు. అనంతరం పోలీసు లాంఛనాలతో రంగస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, వెంకట రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామసులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తపల్లి, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల నిర్మాణం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల ప్రజాపరిషత్ అధికారి భువనేశ్వరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని రైతులు మిని గోకులం షెడ్లను నిర్మించేందుకు రెండు పాడిబర్రెలున్న రైతులకు 1.15 లక్షలు అందిస్తుందని వీటిలో 10 శాతం లబ్ధిదారుడి వాటా ఉంటుందని తెలిపారు. అలాగే నాలుగు బర్రెలున్న రైతుకు రూ.1.85 లక్షలు, ఆరు పాడి బర్రెలున్న రైతులకు రూ.2.30 లక్షలు యూనిట్ విలువ ఉంటుందన్నారు. అలాగే గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణం కోసం 20 జీవాలున్న రైతులకు రూ.1.30 లక్షలు, 50 జీవాలు ఉన్న రైతులకు రూ.2.30 లక్షలు యూనిట్ విలువ ఉంటుందన్నారు. వీటికి 30శాతం లబ్ధిదారుడి వాటా చెల్లించాలని చెప్పారు. అలాగే కోళ్ల షెడ్ల నిర్మాణం కోసం వంద కోళ్లు ఉన్న రైతులకు రూ.87వేలు, 200 కోళ్లు ఉన్న రైతులకు రూ.1.40లక్షల యూనిట్ విలువ ఉంటుందన్నారు. వీటికి కూడా ప్రభుత్వం 70 శాతం రాయితీ ఇవ్వగా.. 30 శాతం లబ్ధిదారుడి వాటా ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు స్థానిక పశువైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గడివేముల: పాడి రైతులు మిని గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి హరిణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రైతులకు ఉండే పశువులను బట్టి యూనిట్ విలువ ఉంటుందని చెప్పారు. గొర్రెలు, మేకలకు, కోళ్ల షెడ్లను కూడా నిర్మించుకోవచ్చన్నారు. మండలానికి 50 మినీ గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

నంద్యాల క్రైం, జూలై 25: నంద్యాల పట్టణంలో నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు గురువారం తెలిపారు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 52వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన మోటార్‌సైకిళ్లకు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా విధించినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి వాటి యజమానులు నెంబర్ ప్లేట్ తెస్తే వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అప్పగిస్తామని ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ జిల్లా అంతటా నిర్వహిస్తామని, ప్రతి వాహనదారుడు వెహికల్‌కు సంబంధించిన నంబర్ ప్లేట్ కలిగి ఉండటంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అలాగే ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని, రోడ్డు భద్రతానిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

కేసులు కొట్టివేయడంపై హర్షం

నంద్యాల (నూనెపల్లె), జూలై 25: గత ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను ముఖ్యమంత్రి చంద్రబాబ ఎత్తివేయడంపై ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నంద్యాల పట్టణ శాఖ కార్యవర్గ సభ్యుడు భత్తుల ఈశ్వరరెడ్డి, పుల్లయ్యనాయక్, మహేంద్రరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు వైసీపీ తీసుకు వచ్చిన జీపీఎస్ చట్టాన్ని కూడా అసెంబ్లీ సమావేశంలో రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌పై త్వరలో నిర్ణయం తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజనులకు వసతులు కల్పించాలి: కలెక్టర్



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది, జూలై 25: నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుగూడెంలో నివసించే గిరిజనులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మహానంది సమీపంలోని చెంచుకాలనీని, గిరిజనులు 36 ఎకరాల్లో సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను కలెక్టర్ పరిశీలించారు. సాగు చేస్తున్న విధానంతో పాటు ఫారం పాండ్స్‌ను అమలు చేస్తున్న విధానంపై గిరిజనుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం చెంచుగూడెం సందర్శించారు. గిరిజనుల పిల్లల విద్యాభ్యాసంతో పాటు గూడెంలో నెలకొన్న సమస్యలపై తెలుసుకొన్నారు. విద్యుత్ సమస్య ఉందని గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, ఉద్యానవనశాఖాధికారి శ్రీధర్, ఉపాధిహామీ ఏపీఎం మనోహర్, పంచాయతీరాజ్ ఏఈ రాముడు, వీఆర్వోలు సురేంద్రరెడ్డి, శివ, మహానంది టీడీపీ నాయకుడు సూరే శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అరటికి దేశవ్యాప్త గుర్తింపు తెస్తాం'

మహానంది మండలంలో సాగు చేసే సుగంధం రకం అరటికి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చి జియో ట్యాగింగ్ అమలు కోసం ప్రయత్నిస్తామని కలెక్టర్ రాజకుమారి చెప్పారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో అరటి ఉత్పత్తిదారులతో జిల్లా ఉద్యానవనశాఖ నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అరటిని ఏపీ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మార్కెటింగ్‌కు కృషి చేయాలని ఉద్యావన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాతవరణంలో వచ్చే మార్పుల వల్ల దెబ్బతిన్న అరటికి వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ వచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే అరటి రైతుకు రూ.2 లక్షల వరకు రుణ పరిమితిని పెంచే విషయంపై పరిశీలిస్తామని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, మండల అరటి రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కొత్తపల్లి, జూలై 25: మండలంలోని శివపురం గ్రామంలో 20 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఎస్‌ఐ మాట్లాడుతూ శివపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామని చెప్పారు. శేఖర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ'

ఆత్మకూరు రూరల్, జూలై 25: పర్యావరణ పరిరక్షణతోనే మానవుని మనుగడ సాధ్యపడుతుందని ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, ఏవో ఉమాశంకర్, ఏబీఎం మధుసూదన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సోమయాజులపల్లెలో పశువైద్య శిబిరం

బండిఆత్మకూరు, జూలై 25: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి మందులు అందజేశారు. పంటతో పాటు పాడి పశువుల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని వైద్యులు అనూష, గౌసియాబేగం, సుధాకర్‌రెడ్డి సూచించారు. అనంతరం పశుపోషకులతో సమావేశం నిర్వహించారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా, సిబ్బంది సమీర, లక్ష్మీప్రసన్న, ఉమామహేశ్వరీ, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి జంప్ రోప్ పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జూలై 25: జిల్లా జంప్ రోప్ అసోషియేషన్, క్రీడా భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో నంద్యాలలో రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభారతి గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నంద్యాలలోని ప్రథమ నంది దేవస్థానం ఆవరణంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి వివిధ కేటగిరీలలో పాల్గొనేందుకు 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు నంది గ్రూప్ సంస్థల ఎండీ సుజల భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు రామకృష్ణ పీజీ కళాశాలలో వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంప్‌రోప్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ, రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

'కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి'

నంద్యాల టౌన్, జూలై 25: నంద్యాల పట్టణంలోని ప్రజలు వీధి కుక్కల, పిచ్చి కుక్కల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్కృద్దీన్ కోరారు. గురువారం సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో కుక్కల దాడులు పెరిగాయని, అయితే మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే కుక్కల బెడదను అరికట్టాలని కోరారు. డంపు యార్డు దగ్గర కుక్క వృద్ధి నియంత్రణ కేంద్రాన్ని మున్సిపల్ అధికారులు కోటి రూపాయలు ప్రజాధనాన్ని ఖర్చు చేసి నిర్మించారని, అయితే నిరుపయోగంగా ఉందని అన్నారు. దీనిపై మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పది రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని ప్రజలను సమీకరణ చేసి మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేసి మున్సిపల్ కౌన్సిల్‌ను కూడా అడ్డుకుంటామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, ధనుంజయ్, సీపీఐ గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

తమ్మరాజుపల్లెలో పారిశుధ్య పనులు

పాణ్యం, జూలై 25: మండలంలోని తమ్మరాజుపల్లె ఎస్సీ కాలనీలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలనీలోని చెత్త, బురద, డ్రైనేజీ పూడికతీత పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పర్యవేక్షణలో చేపట్టారు. వైసీపీ పాలనలో పారిశుధ్యం గురించి పట్టించుకోలేదని టీడీపీ నాయకులు దుబాయ్ శీను, చల్లా సురేష్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణస్వామి, నాగేష్, నరేష్, శేఖర్, ఎర్రమల నాయుడు పాల్గొన్నారు.

28న బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల (నూనెపల్లె), జూలై 25: నంద్యాలలో నందమూరి నగర్‌లో ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ రెడ్డి తెలిపారు. పోటీల్లో ప్రతిబ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన జట్లు ఆగస్టు 2,3,4 తేదీలలో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మరిన్ని వివరాలకు 9849548926, 9441243601 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

● నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సరళమ్మ



హ్యాండ్ స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ

నంద్యాల టౌన్, జూలై 25: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వర్షాధారిత మెట్ట ప్రాంత రైతాంగానికి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకొని అధిక నికర లాభాలు పొందాలంటే చిరుధాన్యాల పంటలు సాగు చేయడం మంచిదని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ అన్నారు. అఖిల భారత సమన్వయ పథకం - చిరుధాన్యాలు పథకంలో షెడ్యూల్డ్ ఉప ప్రణాళిక 2023 -2024 సంవత్సరానికి చిరుధాన్యాలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ చిరుధాన్యాలను సాగు చేయడంతో పాటు ఆహారంలో కూడా భాగం చేసుకొని వినియోగించినట్లైతే ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. చిరుధాన్యాలలో ప్రధానమైన కొర్రసాగు మన ప్రాంతానికి ఎంతో అనువైనదని, ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో వివిధ రకాల కొర్ర విత్తనం, వివిధ ప్రాంతాలకు అనువైన రకాలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. కొర్ర సాగుకు సహజంగా ఎటువంటి రసాయనాలు లేకుండా పండించవచ్చన్నారు. సాగు ఖర్చు కూడా తక్కువ అని, చీడ, పీడల ఉధృతి కూడా తక్కువ అని, ఎటువంటి అదనపు ఖర్చులు లేకుండా కొర్ర సాగు చేయవచ్చునని అన్నారు. అనంతరం 25 మంది రైతులకు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో రైతులకు స్ప్రేయర్లు, వేప నూనె, తెగుళ్ల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

'వ్యాధుల నివారణపై అవగాహన పెంచుకోండి'



మాట్లాడుతున్న ఆకాష్ హాస్పిటల్ చైర్మన్ శ్రీహరి

ఆత్మకూరు, జూలై 25: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఆర్ఎంపీలు, పీఎంపీలు వ్యాధుల నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి చికిత్సలు అందించాని ఆకాష్ హాస్పిటల్ చైర్మన్, ఎండీ శ్రీహరి సూచించారు. ఆత్మకూరులోని చక్రం హోటల్‌లో గురువారం ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆకాష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి వాటి నివారణకు చేపట్టాల్సిన చికిత్సల గురించి మెలకువలను అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఆయా వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండి ఆయా వ్యాధులకు ఏవిధంగా ప్రథమ చికిత్సలు అందించాలో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవి, ఆర్ఎంపీ, పీఎంపీ అసోషియేషన్ ప్రతినిధులు సలాం, రాము, చింతలయ్య, వెంకటేశ్వర్లు, హిదాయతుల్లా, నగేష్, మగ్బూల్‌బాషా, ఖయ్యూం తదితరులు ఉన్నారు.

'బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి'

పగిడ్యాల, జూలై 25: ముచ్చుమర్రికి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యద ర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లబకాష్ కోరారు. మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో హత్యకు గురైన వాసంతి కుటుంబ సభ్యులను గురువారం వారు పరామర్శించారు. వాసంతి కుటుంబ సభ్యులతో మాట్లాడి హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకొని నదీతీర ప్రాంతాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌ల విధానాన్ని తీసుకొని వచ్చి విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేసిందన్నారు. మాజీ సీఎం జగన్ విద్యా వ్యవస్థలో ట్యాబ్‌లను ప్రవేశ పెట్టడంతోనే విద్యార్థుల్లో నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు అందజేసిన ట్యాబుల ద్వారా వారికి ఎలాంటి ఉపయోగం లేదని, వాటి ద్వారా అశ్లీల దృశాలు, నేర ప్రవృత్తికి సంబంధించిన వాటికి ఉపయోగపడ్డాయని అన్నారు. ప్రభుత్వం పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా బోధన పద్ధతిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. బాలిక హత్యకు గురై 20 రోజులు కావస్తున్నా మృతదేహం లభ్యం కాకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పౌర హక్కుల సంఘం నాయకులు కరీం బాషా, ఇదయతుల్లా, సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

'నాణ్యమైన భోజనం అందించాలి'

పాములపాడు, జూలై 25: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకపోతే నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంపీడీవో సరస్వతి హెచ్చరించారు. మండలంలోని వేంపెంట ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బానకచెర్ల, వేంపెంట గ్రామాలలోని సచివాలయాలు తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు.

'రోగులకు మెరుగైన వైద్య సేవలు'



రోగిని విచారిస్తున్న డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా

పాణ్యం, జూలై 25: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా సామాజిక ఆరోగ్య అధికారి డాక్టర్ జఫ్రుల్లా తెలిపారు. పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అటెండెన్స్, డెలివరి వివరాలు, మందుల నిల్వలను, రోగుల రిజిస్ట్రేషన్, జనరల్ ఓపీ రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డుల్లోని రోగులను పరిశీలించి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పనితీరుపై రోగులకు అవగాహన పెంచాలన్నారు. మద్దూరు ప్రాథమిక కేంద్రంలో ఈడీడీలు తక్కువ సంఖ్యలో ఉండడంతో ఇప్పటి వరకు 15 కాన్పులే చేశారన్నారు. డెలివరీ అయిన మహిళలకు స్థానికుల ద్వారా ఆహారం అందిస్తున్నామన్నారు. హెచ్‌డీఎస్ కమిటీ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. 79 ల్యాబ్ పరీక్షల్లో 49 పరీక్షలు చేస్తున్నామన్నారు. సర్జికల్ గ్లోవ్స్ మినహా మందుల కొరత లేదన్నారు. ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ లేదని, సెమీ ఆటోమేటిక్ ఎనలైజర్ మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాణ్యం ఆసుపత్రిలో నెలకు 30 ప్రసవాలు చేయాలని గైనకాలజిస్టుకు సూచించారు. ఆసుపత్రికి జనరేటర్ లేదని, ఇన్వర్టర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో పారిశుద్య సమస్య ఉండడంతో విష పురుగుల దాడి ఎక్కువై రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆసుపత్రి మెడికల్ అధికారి డాక్టర్ రోహేలా డీసీహెచ్ఎస్ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రికి రావడానికి సరైన రహదారి లేదని వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: డీఈవో



విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న డీఈవో సుధాకరరెడ్డి

ఆత్మకూరు రూరల్, జూలై 25: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈవో సుధాకరరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ విద్యావారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి వారికి రూ.3 వేల నగదును బహుమతిగా అందించారు. ఎంఈవో బాలాజీనాయక్, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు జవహర్‌నాయక్, దాదాపీరా, దాసు, శోభన్, పుష్పలత, సునీత, సత్యవాణి, మంజువాణి, పద్మావతి, పాల్గొన్నారు.

'బలిజ సంఘీయుల మద్దతు మరువలేనిది'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూలై 25: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి బలిజ, కాపు సంఘీయుల మద్దతు, ప్రోత్సాహం మరువలేనిదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. బలిజ సంఘం యువకుల ఆత్మీయ అభినందన సమావేశం గురువారం నంద్యాలలో నిర్వహించారు. ఫిరోజ్‌తో పాటు టీడీపీ, రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారావు, ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో ఫరూక్ విజయానికి కృషి చేసిన ప్రతి నాయకులను కార్యకర్తలకు, ప్రజలకు రుణపడి ఉంటామని అన్నారు. బలిజ కాపు సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకటనరేష్, దస్తగిరి, మలికార్జున, చింటు, తదిరతులు పాల్గొన్నారు.

'నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు'

బండిఆత్మకూరు, జూలై 25: నకిలీ ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో స్వాతి హెచ్చరించారు. శుక్రవారం బండిఆత్మకూరులోని దుర్గాభవాణి, పార్నపల్లెలోని ప్రశాంతి ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా గోదాములోని ఎరువుల, పురుగు మందుల నిల్వలను, నిల్వ, అమ్మకం రికార్డులను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు.

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం'

నందికొట్కూరు జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు అన్నారు. నందికొట్కూరులో గురువారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకోకపోగా గతం కన్నా రూ.632 కోట్లు తగ్గించారని అన్నారు. పక్కీర్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, నాగన్న, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

'వీఆర్వోలను బదిలీ చేయాలి'

నందికొట్కూరు జూలై 25: నందికొట్కూరు మండలంలో కొంత మంది వీఆర్వోలు ఏళ్ల తరబడి పాతుకుపోయి ప్రజలకు సేవలు చేయడం లేదని, వారిని తక్షణమే బదిలీ చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్ రాజు కోరారు. ఆర్డీవో పద్మజకు గురువారం వినతి పత్రం సమర్పించారు. మండలంలో కొందరు వీఆర్వోలు రాజకీయ నాయకుల అండదండలతో 10 నుంచి 15 సంవత్సరాల పాటు పాతుకుపోయారన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజు నాయుడు, డెమొక్రటిక్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో ఆధార్ క్యాంపు

మహానంది, జూలై 25: మండలంలోని గోపవరం గ్రామంలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పంచాయతీ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులతో పాటు ఆధార్‌లో మార్పులు చేర్పులను గ్రామ ప్రజలు నమోదు చేసుకున్నారన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు సోమశేఖర్

నందికొట్కూరు, జూలై 25: నందికొట్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు)లో ఈనెల 18 నుంచి కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాన్ని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకుడు సోమశేఖర్, నంద్యాల జిల్లా ఏఎంవో లలిత కుమారి, ఏఏఎంవో యూసఫ్ బాషా గురువారం పరిశీలించారు. ఈ శిక్షణను ఉపయోగించుకుని పాఠశాల అభ్యసనకు ఉపయోగించి మెరుగుపరచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

'పండ్ల తోటలు సాగు చేయాలి'

వెలుగోడు, జూలై 25: చిన్న, సన్నకారు రైతులు తమ పంట పొలాల్లో పండ్లతోటలు సాగు చేసుకోవాలని ఏపీవో మల్లికార్జున సూచించారు. గండిపేటలో చిన్న, సన్నకారు రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ.. రైతులు ఉపాధి హామీ పథకంలో భాగంగా చిన్న సన్నకారు రైతులు తమ పొలాల్లో పండ్లు, పూల మొక్కలు నాటుకుంటే ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలను వివరించారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన

పాములపాడు, జూలై 25: పంటసాగుపై సలహాలు, సూచనలు, మెళకువలపై రైతులకు వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. మండలంలోని వేంపెంట గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సుల్తాన్, శంకర్ ఏఈవో మద్దిలేటి రైతులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి'

పాములపాడు, జూలై 25: రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ పాఠశాల, మోడల్ స్కూల్, వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వార్డన్స్, వర్కర్స్‌కు, ఆప్కాస్‌కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం పాములపాడులోని మోడల్ స్కూల్‌లో ఆప్కాస్ సిబ్బందితో కలసి సమస్యలపై చర్చించారు. మోడల్ స్కూల్ జిల్లా ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు శ్యామలమ్మ, రూపాదేవి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సేంద్రియ పద్ధతిలో నాణ్యమైన దిగుబడి'

ఆత్మకూరురూరల్, జూలై 25: వరి పంట సాగులో సేంద్రీయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఎరువులు తగ్గించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి పొందవచ్చని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని సంజీవ్‌నగర్ తాండాలో వరిపంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వరి పంటపై మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగులు నాయక్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు శాఖలను విచారించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శిల్పా వెంచర్ కోసం అక్రమంగా కేసీ కాలువ తొలగింపునకు సహకరించిన కేసీ, మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ శాఖలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ శాసన సభ స్పీకర్‌ను కోరారు. రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో గురువారం ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో గత నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన కేసీ ఉప కాలువ ద్వారా సుమారు 7వేల ఎకరాలకు సాగు నీరు అందుతోందన్నారు. అలాంటి కాలువను వైసీపీ ప్రభుత్వంలో శిల్పా చక్రపాణిరెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం నిబంధనలకు విరుద్ధంగా కేసీ కాలువను తొలగించారని స్పీకరుకు వివరించారు. కేసీ కాలువ తొలగింపునకు ఆళ్లగడ్డ మున్సిపాలిటీ, కేసీ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు పూర్తిగా సహకరించారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఆళ్లగడ్డకు వచ్చినపుడు శిల్పా వెంచర్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపడతామని చెప్పారని గుర్తు చేశారు.

'విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి'



శిక్ష సప్తాహ్‌లో పాల్గొన్న ఎంఈవోలు

చాగలమర్రి, జూలై 25: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేలా బోధన చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. చాగలమర్రి బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన శిక్షసప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన, నాటికలు నిర్వహించేలా చూడాలని అన్నారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల పనితీరుపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కోటయ్య, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

చాగలమర్రి, జూలై 25: గ్రామాల్లో ఎరువుల దుకాణ డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని మనగ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని అన్నారు. శాంపిళ్లను సేకరించామని చెప్పారు. అనంతరం చిన్నవంగలి గ్రామంలో వ్యవసాయ పనిముట్ల గురించి విచారణ చేశారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు ఫరూక్, శ్రావణి ఉన్నారు.

అభివృద్ధి దిశగా అమరావతి: టీడీపీ

డోన్(రూరల్), జూలై 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని డోన్ పట్టణ టీడీపీ యువ నాయకుడు హనుమంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని అన్నారు.

డోన్ రైల్వేస్టేషన్ అభివృద్ధి నిధులపై హర్షం

డోన్(రూరల్), జూలై 25: డోన్ రైల్వేస్టేషన్ అభివృద్ధి నిధుల కేటాయింపుపై జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కేంద్రానికి డోన్ రైల్వే అభివృద్ధికి నిధులు కేటాయించిన నివేదికపై అమృత్ భారత్ పథకం కింద డోన్ రైల్వేస్టేషన్‌ను చేర్చడం హర్షణీయమన్నారు.

'పండ్ల తోటల సాగు లాభదాయకం'

చాగలమర్రి, జూలై 25: పండ్ల తోటల సాగు లాభాదాయకమని ఏపీవో నిర్మల సూచించారు. గురువారం మండలంలోని కేపీ తండా గ్రామంలో గిరిజనులకు పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

'పశువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూలై 25: వర్షాకాలం కావడంతో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. చాగలమర్రి పశువైద్య కేంద్రం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ, గొంతువాపు వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. గొర్రెల్లో వచ్చే నీలి నాలుక, చిటిక వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. మినీ గోకులాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

కోవెలకుంట్ల, జూలై 25: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన లక్ష్మి ప్రసన్న అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన లక్ష్మి ప్రసన్న సంఘం పాల డెయిరీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని పాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో సుమారు రూ.5 లక్షలా 74వేల పాలను పంపించి తీసు కుని డబ్బులు చెల్లించకుండా వేరొక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని సంఘం డెయిరీకి చెందిన వస్తువులను తిరిగి ఇవ్వకపోవడంతో బాకీ డబ్బులు చెల్లించకపోవడంతో సంఘం డెయిరీకి చెందిన మేనేజరు సుధీర్ కోవెలకుంట్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు లక్ష్మి ప్రస న్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల, జూలై 25: మండలంలోని ముద్దవరం గ్రామానికి చెందిన వీరభద్రుడు అనే నాటుసారా విక్రేత నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య గురువారం తెలి పారు. మండలంలోని ముసలాయ చెరువు గ్రామ సమీపంలోని కొండ వద్ద నాటుసారా విక్రయాలు కొనసాగుతున్నాయన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. నాటుసారా విక్రయిస్తున్న వీరభద్రుడు పరారయ్యాడని, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

స్పెషల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కొలిమిగుండ్ల, జూలై 25: స్పెషల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలని కల్వటాల టీడీపీ సర్పంచ్ సుమలత అన్నారు. గురువారం కల్వటాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె టీడీపీ నాయకుడు కృష్ణరంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. డిజిటల్ అసిస్టెంట్ రవి, విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా జియారత్

రుద్రవరం, జూలై 25: మండలంలోని మందలూరు గ్రామంలో గురువారం రాత్రి జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి దస్తగిరి స్వామితో పాటు మరో రెండు పీర్లకు పూలసేరాలు, వెండి గొడుగులు సమర్పించారు. జియారత్ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు ఫాతేహాలు చేశారు.

పాడి పరిశ్రమకు పండగ

- మళ్లీ తెరపైకి గోకులం షెడ్లు
- 90 శాతం రాయితీతో నిర్మాణాలు
- జిల్లాకు 850 షెడ్లు మంజూరు

కొలిమిగుండ్ల, జూలై 25: పాడి పరిశ్రమకు మళ్లీ పండగొచ్చింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమకు ప్రాధాన్యత పెరిగింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయం, పాడి పరిశ్రమను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ప్రోత్సాహం అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. అయితే కూటమి ప్రభుత్వం పశుపోషకులను ఆదుకోవాలని మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాకు సంబంధించి ప్రభుత్వం మొత్తం 850 మినీ గోకులం యూనిట్లను మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 29 మండలాలకు మండలానికి 30 యూనిట్ల వరకు నిర్మించుకోవడానికి అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల ద్వారా నిర్మించే ఈ షెడ్లకు 90శాతం నిధులు ప్రభుత్వం వెచ్చిస్తుంది. 10 శాతం పాడి రైతులు ఖర్చు పెట్టుకోవాలి. మేకలు, గొర్రెలు, కోళ్ల గోకులం షెడ్లకు 70 శాతం నిధులు ప్రభుత్వం వెచ్చించగా, 30శాతం లబ్ధిదారులు ఖర్చు పెట్టుకోవాలి. టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించి పశు పోషకులకు మరింత చేయూతనివ్వాలని నిర్ణయించింది.

పథకాన్ని అటకెక్కించిన గత ప్రభుత్వం: మినీ గోకులం షెడ్ల నిర్మాణ పథకాన్ని 2014-19 సమయంలో టీడీపీ ప్రభుత్వం తీసుకవచ్చింది. రైతులకు మినీ గోకులం షెడ్లు నిర్మించి, పాడి పరిశ్రమకు అండగా నిలిచింది. అ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. షెడ్లు నిర్మించుకున్న రైతులకు కూడా నిధులివ్వకుండా హింసించింది. దీంతో పాడి పరిశ్రమ కష్టాల్లోకి వెళ్లింది. కూటమి అధికారంలోకి రావడంతో తమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని పాడి రైతులు ఆనందిస్తున్నారు.



గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన గోకులం షెడ్డు(ఫైల్)

ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం: మినీ గోకులం షెడ్లకు సంబంధించి చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన వర్గాల వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. మహిళలు, దివ్యాంగ కుటుంబాల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత స్థలం ఉండి, పై అర్హతలు ఉన్న రైతులు మండల కేంద్రాల్లోని పశువైద్య కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మినీ గోకులం షెడ్లతో ఉపయోగకరం



మీని గోకులం షెడ్లు రైతులకు ఎంతో ఉపయోగకరం. దీని వల్ల పాడి పరిశ్రమ మరింత పుంజుకుంటుంది.

\- ఓబయ్య, కోరుమానుపల్లె, రైతు

ఈ పథకం ఓ వరం



చిన్న, సన్నకారు రైతులకు మినీ గోకులం పథ కం ఓ వ రం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

\- భూపాల్‌రెడ్డి, చెన్నంపల్లె, రైతు

జిల్లాకు 850 యూనిట్లు మంజూరు

నంద్యాల జిల్లాకు 850 యూనిట్లు మంజూరయ్యాయి. పేద రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. పశువైద్యశాలల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

\- గోవిందనాయక్, నంద్యాల జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

మంత్రి బీసీ సహకారంతో
కళాశాలలో తాగునీటి సౌకర్యం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ ఫక్కీరారెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 25: కొలిమిగుండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో తాగునీటి పథకాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ ఫక్కీరారెడ్డి ప్రారంభించారు. గురువారం ఐవీ పక్కీరారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు, మోటారును ప్రారంభించారు. ఐవీ పక్కీర్‌రెడ్డి సొంత డబ్బుతో తాగునీటి బోరు వేయించి మోటారు ఏర్పాటు చేసి తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం సమన్వయ కర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, ఉలువల నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

బనగానపల్లె , జూలై 25: బనగానపల్లె సెబ్ పరిధిలోని కొలిమిగుండ్ల, బెలుం గ్రామాల్లో సెబ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహిచి ఇరువురు నాటుసారా విక్రేతలను అరెస్టు చేసి వారి వద్ద ముగ్గురు వ్యక్తులనుంచి 90 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర తెలిపారు. కొలిమిగుండ్లకు చెందిన నరసింహుడు వద్ద 20 లీటర్లు నాటుసారా, ఉలువల రామలక్ష్మయ్య వద్ద 40 లీటర్లు, రంగప్ప వద్ద 30 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువత సమాజ చైతన్యానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె, జూలై 25: యువత సమాజ చైతన్యానికి కృషి చేయాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అన్నారు. గురువారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బాబునాథ్ ఆధ్వర్యంలో యువతకు సామాజిక భద్రతపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, బానిస కావద్దన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయకుమారి, అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వసుందరమ్మ, మహమ్మద్‌గౌస్, సీతమ్మ, రామకృష్ణ, కౌసల్య, నాగతిమ్మయ్య, నాగరాజారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జూలై 25: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్, గురుకుల బీసీ బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శివశంకరుడు హాస్టళ్లను సందర్శించి వర్షాకాలంలో వచ్చే జ్వరం, జలుపు, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, డెంగ్యూ, మలేరియా పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మిట్టపల్లెను అభివృద్ధి చేసుకుందాం: సర్పంచ్

బనగానపల్లె, జూలై 25: సమష్టిగా మిట్టపల్లె గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్, టీడీపీ నాయకుడు ఎడమకంటి తులసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిట్టపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తులసిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రజలు వీధిలైట్లు, నీటి కొళాయిలు లేక ఇబ్బంది పడుతున్నట్లు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వీధిలైట్లు, కొళాయిలు ఏర్పాటు చేస్తామని గ్రామ ప్రజలకు సర్పంచ్ హామీ ఇచ్చారు. వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విశ్వనాథరెడ్డి, వడిసెల రామసుబ్బారెడ్డి, మహానందిరెడ్డి, హరికృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి: సీపీఐ



బాధితురాలిని పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

డోన్(రూరల్), జూలై 25: డోన్ పట్టణ సమీపంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో సెక్యూ రిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సుమిత్ర ఇటీవల ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సుమిత్రను సీపీఐ నాయకుల బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ వేధింపుల వల్లనే సుమిత్ర ఆత్మహత్యకు పాల్పడిందని ఆరో పించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ప్రభాకర్, షమీమ్ బేగం పాల్గొన్నారు.

రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం

కొలిమిగుండ్ల, జూలై 25: రైతులకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గం సమన్వయ కర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోకి కనకాద్రిపల్లె, పెట్నికోట గ్రామాల రైతులతో కలిసి మండల వ్యవసాయ విస్తరణా ధికారి నాగరాజు ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. వీఆర్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులను ఉపయో గించుకొని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, రామలక్ష్మణ్, రామిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, వీఆర్‌వో చెన్నయ్య, వీఏఏ శాంతి, రైతులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికే గ్రామసభ'

రుద్రవరం, జూలై 25: మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో ఉప సర్పంచ్ బాలరాజు ఆధ్వర్యంలో గ్రామ సమస్యల పరిష్కారానికి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో గ్రామంలోని సమస్యలు చర్చించి పరిష్కరించేందుకు తీర్మానించారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, వాటర్‌ట్యాంకు మరమ్మతులు మరికొన్ని సమస్యలు పరిష్కరించేందుకు తీర్మానం చేసినట్లు కార్యదర్శి రవీంద్రనాయక్ తెలిపారు. కార్యక్రమంలో మహేంద్రరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

బేతంచెర్ల, జూలై 25: మండలంలోని సిమెంటునగర్ గ్రామానికి చెందిన ఆలీ హుశేన్ (30) అనే భవన నిర్మాణ కార్మికుడు బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తోటి భవన కార్మికులు రూ.12 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మికులు, పాలిష్ కట్టర్లు పాల్గొన్నారు.

'కుష్ఠు వ్యాధి సర్వేలో నిర్లక్ష్యం తగదు'

రుద్రవరం, జూలై 25: కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేలో నిర్లక్ష్యం తగదని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసరు రమణ అన్నారు. గురువారం రుద్రవరంలో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ఆగస్టు 2 వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ఇంటిని సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్, సూపర్‌వైజర్ యోగేశ్వరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: కుష్ఠువ్యాధి రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ముత్యాలపాడు వైద్యాధికారిణి సుల్తాన తెలిపారు. మండలంలోని కేపీ తండా గ్రామంలో గురువారం ఇంటింటికి వెళ్లి చేస్తున్న కుష్ఠువ్యాధి సర్వేను పరిశీలించారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న అనుమానిత కేసులను గుర్తించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వాణి, హెచ్‌ఈ మనోహర్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రుద్రవరంలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసరు రమణ

ఆడపిల్లలను రక్షించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం

బనగానపల్లె, జూలై 25: ఆడపిల్లలను రక్షించి చదివించాలని కోరుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇల్లూరు కొత్తపేటలో భేటీ బచావో, భేటీ పడావో ర్యాలీ నిర్వహించారు. గురువారం బనగానపల్లె మండలంలోన ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమార్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, ర్యాలీలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమార్ బాబు మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆడ, మగ అన్న వివక్షత కూడదన్నారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం బాలికలకు చేయకూడదన్నారు.

'యాదవ సమస్యలపై పోరాటం'

దొర్నిపాడు, జూలై 25: యాదవుల సమస్యలపై పోరాడతామని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి బత్తుల కృష్ణయ్య యాదవ్ అన్నారు. మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన కృష్ణయ్యయాదవ్‌ను మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ యాదవులంతా ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకునేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు.

'నీరు విడుదల చేయాలి'

రుద్రవరం, జూలై 25: జిల్లాలోని తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ, కేసీ కెనాల్, హంద్రీ నీవా కాలువలకు నీరు వదిలి జిల్లాలోని రిజర్వాయర్లను, చెరువులను నింపాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా, తుంగభద్ర నదులకు ప్రవహిస్తున్న వరదనీరు ప్రవాహం వల్ల శ్రీశైలం డ్యాంలో 854 అడుగులకు చేరిందన్నారు. సాగునీటి సలహా మండలి సమావేశం వెంటనే జరిపి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు ద్వారా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

నంద్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రంగస్వామి(45) అనారోగ్యంతో ఆళ్లగడ్డలో గురువారం ఉదయం మృతి చెందారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లగానే షుగర్ లెవెల్స్ తగ్గిపోవడంతో మృతి చెందారు. డీఎస్పీ షర్ఫుద్దీన్, పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐలు నగినా, వెంకటరెడ్డి సంతాపం తెలిపారు. ఆయన స్వగ్రామం మిడుతూరు మండలం తలముడిపి గ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

బాలికలు క్రమశిక్షణతో మెలగాలి

ప్యాపిలి, జూలై 25: బాలికలు క్రమశిక్షణతో మెలగాలని ఎంపీడీవో సాయిమనోహర్ అన్నారు. గురువారం పట్టణంలోని సరస్వతి శిశుమం దిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల అవగా హన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలన్నారు. బాలవి వాహాలు చేస్తే చట్టపరమైన కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్ర మంలో సీడీపీవో శంషాద్ బేగం, డిప్యూటీ తహసీల్దారు మారుతి, అంగన్‌వాడీ వర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలో ప్రజలకు భరోసా'



సభ్యత్వ నమోదు చేస్తున్న జనసేన నాయకులు

చాగలమర్రి, జూలై 25: రాష్ట్రంలో చంద్రబాబు పాలనపై ప్రజలకు భరోసా నింపిందని జనసేన నాయకులు అబ్దుల్లా, సుబ్బయ్య తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్-6 పథకాలను అమలు చేయడం హర్షణీయమని అన్నారు. మాట నిలబెట్టుకుంటున్న చంద్రబాబు పాలనతో ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమలో జనసేన నాయకులు షబ్బీర్, లింగారెడ్డి, సంజీవకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో 117ని రద్దు చేయాలి



ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి, జూలై 25: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసేలా వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబరు 117 వెంటనే రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతిప్రియ మాట్లాడుతూ గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ప్రభుత్వం ఆ సంస్కరణలపై దృష్టి సారించి తగిన మార్పులు చేసి విద్యావ్యవస్థను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లతీఫ్, నరసింహారెడ్డి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రాంకో ప్రతినిధులు



ఎస్పీని అభినందిస్తున్న రాంకో ప్రతినిధులు

కొలిమిగుండ్ల , జూలై 25: నంద్యాల జిల్లా నూతన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను రాంకో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏఎస్పీ ప్రవీణ్, జేసీ విష్ణుచరణ్‌లను కలిసి బోకే అందించారు. జిల్లా అధికారులకు ఎలాంటి సహకారమైన అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

పిల్లలను ఎత్తుకెళ్లే ప్రయత్నం?

గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చినట్లు ప్రచారం

రుద్రవరం, జూలై 25: రుద్రవరంలో బుధవారం సాయంత్రం కారులో వచ్చిన గుర్తు తెలియని దుండగులు పిల్లలను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గురువారం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. రుద్రవరంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఒకటో తరగతి బాలికను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారని, అయితే కొందరు అటువైపు రావడంతో బాలికను వదిలి పారిపోయినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే ప్రయత్నం ఎందుకు చేశారు? అని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఏఎస్‌ఐ శోభన్‌బాబు మాట్లాడుతూ తమ దృష్టికి రాలేదని, స్థానికంగా విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

వైభవంగా సాయి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, జూలై 25: చాగలమర్రి గ్రామంలో గురువారం వైభవంగా సాయి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. వేద పండితులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయివ్రతం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక హారతులు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నా రు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. రుద్రవరంలో పూలమాలలతో సాయి విగ్రహాన్ని అలంకరించారు.



చాగలమర్రిలో సాయిబాబా పల్లకీ ఉత్సవంలో భక్తులు